# మంచి-చెడూ

ముద్దంశెట్టి హనుమంతరావు

*

విజయవాడ స్టేషన్లో కలకత్తా పోయే మెయిలు ఆగి వుంది.

ఫామిలీని ఓ బెంచీమీద కూచోబెట్టి, ఫస్టుక్లాసు రిజర్వేషను చార్టు చూడ్డానికి వెళ్ళాను. ఏ కంపార్టు మెంటులోనూ నా పేరు లేదు. పదిరోజులు ముందుగానే టెలిగ్రావ్ఁ పంపినా, రిజర్వేషను దొరకనందుకు, నా దురదృష్టాన్ని తిట్టుకున్నాను. నిరుత్సాహం నన్నావరించింది. కాని, యేం చెయ్యను? ఎక్కడా ఖాళీలు వున్నట్టు కూడా కనిపించలేదు.

రిజర్వేషను లేకుండా, కలకత్తా వరకూ వెళ్ళడం సాధ్యపడదని నిర్ణయించుకున్నాను. అందుకే, రాజమండ్రిలో దిగిపోయి, మర్నాడు ఈస్టుకోస్టులో బయల్దేరాలనుకున్నాను. ఈస్టుకోస్టులో రిజర్వేషను దొరికిపోతుందన్న ధైర్యం నాకుంది.

అంచేత, రిజర్వేషను కోసం మరి ప్రయత్నించకుండా, ఓ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో 'ఎ' కాబిన్ ఖాళీగా వుండడం చూసి, అందులో యెక్కేశాను కుటుంబసమేతంగా.

ఎందుకయినా మంచిదని, ఫస్టుక్లాసు కండక్టర్ దగ్గరికివెళ్ళి, విషయాన్ని సవిస్తరంగా చెప్పి, రాజమండ్రి వరకే వెళ్తున్నానని, ఫలానా కంపార్టుమెంటులో 'ఎ' కేబిన్‌లో కూచున్నానని చెప్పాను.

ఏ మూడ్‌లో వున్నాడో కండక్టరు మరి—లేకపోతే, అతని ప్రవృత్తే అంతేనేమో, 'కయ్' మన్నాడు. "మీ యిష్టం వచ్చినట్టు కూచుంటే యెట్లాగండీ? రైల్వే వుద్యోగులైనంత మాత్రాన, మీరిలా అడ్వాంటేజ్ తీసుకో కూడదుకదా? నాతో చెప్పకుండా యెందుకు అందులో కూచున్నారు? నో...నో...ఖాళీ చెయ్యండి. ఇద్దరు టిక్కెట్టు హోల్డర్సు వున్నారు..." విసుగ్గా అన్నాడు.

అతని ముఖం అమావాస్య నాటి చీకటిని గుర్తుచేస్తోంది. అతని ప్రక్కనే ఓ యిద్దరు వ్యక్తులు నిల్చుని వున్నారు. వాళ్ళ వేషభాషలు చూస్తే, బాగా డబ్బున్న వారిలానే కనిపిస్తున్నారు. బహుశా, వాళ్ళిద్దరి విషయమే అతను చెబుతున్నాడనిపించింది.

"అయితే, మమ్మల్నెక్కడ కూచోమంటారు?"

"మరో బండిలో వెళ్ళండి." నిర్లక్ష్యంగా అన్నాడాయన.

"అదేమిటి? పగటిపూట ప్రయాణం చెయ్యడానికి, రిజర్వేషను అవసరం లేదు కదండీ?" ఆ విషయం నాకు తెలుసును గాబట్టే అడిగాను.

అతను మరింత విసుగ్గా ముఖం పెట్టాడు. నాకేసి అదోలా చూశాడు.

"మన రైల్వే వుద్యోగస్తులతో యిదే చిక్కండీ! రూల్సు గురించి మాట్లాడతారు. అదంతా నాకు అనవసరం. మీరు దిగిపోండి" నియంతలా నిష్కర్షగా చెప్పాడు.

"ఆ కేబిన్‌లోకి రావల్సిన వాళ్ళు, వీళ్ళిద్దరే కదండీ! వాళ్ళని రానివ్వండి. మేం కాదనడం లేదుకదా! మరో మూడు గంటల తర్వాత మేం దిగిపోతాం." సర్దుకుపోయే ధోరణిలో అన్నాను.

"అయినా, వీల్లేదు. మీరు దిగిపోవల్సిందే! ఆ కేబిన్ ఖాళీ కావాలి."

అతను యెందుకలా పట్టుబట్టాడో నాకే బోధపడలేదు. అతని కోటు కాలరు దగ్గరున్న నేమ్ ప్లేటుని చూశాను. 'ఎ. రాఘవులు' అని వుంది.

అతని మొండి మాటలు, నాలోని సహనాన్ని రెచ్చకొట్టాయి. అర్థరహితంగా, అతనలా చెప్పడమేమిటి? రైలుబండి అతని స్వంత సొత్తులా మాట్లాడతాడేమిటి?... అనిపించి, నా అభిమానం దెబ్బతింది.

"నేను అందులోంచి వెళ్ళనండీ. మీరేం చేస్తారో, చెయ్యండి." అంటూ విసురుగా వచ్చేశాను కంపార్టుమెంటులోకి.

బెర్తుపై కూచుంటూనే ఫేంటు జేబులోంచి రుమాలు తీసి, మొహం ఒత్తుకున్నాను. నా మొహంలో తారాడే అశాంతిని చూసి, మా శ్రీమతి అడిగింది.

"ఏమయ్యిందండీ?" అని.

జరిగిందంతా చెప్పాను. ఆమె ఓ నిట్టూర్పు విడిచింది.

"తోటి రైల్వే వుద్యోగన్న అభిమానమైనా లేదేమిటండీ అతనికి?" అంది.

"అదేవుంటే, దేశంలో ఐకమత్యానికి కొరవుండేదికాదు" అనేశాను.

ఇంతలో, కండక్టరు దగ్గరే నిల్చున్న యిద్దరూ వచ్చారు. బోలెడు సామానుంది. సామాను యెలాగో సర్ది, కూచున్నారు.

"కేబిన్ పూర్తిగా యిస్తానని హామీయిచ్చి, కండక్టరు యెలా మోసంచేశాడో చూడ్రా రామం" అని ఆ యిరువుర్లో ఒకాయన అన్నాడు.

"మన దగ్గర తీసుకున్న డబ్బు యిచ్చేయమంటే సరి " రెండో వ్యక్తి అన్నాడు విసురుగా.

నాకు అంతా అర్థమయ్యింది. నేను వాళ్ళని ప్రశ్నించకుండానే, విషయం తెలిసినందుకు, నాకెంతో ఆనందంగా వుంది. అయితే, ఈ సమస్య అప్పుడే నన్ను వదిలిపెట్టదనుకున్నాను.

అంతలో, కండక్టరు రాఘవులు వచ్చాడా కేబిన్‌లోకి.

వాళ్ళిద్దరూ రాఘవులు కేసి, కాస్తంత యిబ్బందిగా చూశారు.

"మీ పాసు చూపించండి." అన్నాడు రాఘవులు నన్నుద్దేశించి.

అడిగే ధోరణిబట్టి, పాసులో యేదేనా తప్పు దొరకాలి. అప్పుడు తడాఖా చూపిస్తాను అన్నభావం స్ఫురిస్తుంది.

అయినా, నేనేం బెదిరిపోలేదు. నిర్భయంగా పాసు అందించాను. ఎంతో పరిశీలనగా అంతా చూశాడు. ఎక్కడా యేలోపాన్నీ గుర్తించలేకపోయాడు. విసుగ్గా 'పాసు' ని నాకు తిరిగి ఇచ్చేశాడు.

"మీరు మరో కేబిన్‌లోకి మార్చేయండీ! రాజమండ్రి వరకే కదా, సర్దుకుపోవచ్చు" మళ్ళీ పాతపాటే పాడాడు రాఘవులు.

"ఇప్పుడిక్కడ యెవ్వరికీ యిబ్బంది కలగలేదు కదండీ!" అన్నాను.

"వాళ్ళవాళ్ళు యెవరో వస్తారట"

"రానివ్వండి, చూద్దాం."

"అయితే, మీరు యిక్కణ్ణించి మార్చరన్నమాట?" కాస్తంత కటువుగానే అన్నాడు.

"ఎందుకు మార్చాలీ అంటాను."

"జి ఆర్పీని పిలవమంటారా?"

"పిలవండి. వాళ్ళతోపాటు, మీ స్టేషను సూపరింటెండెంటుని కూడా పిలవండి. మాట్లాడతాను" నిబ్బరంగానే అన్నాను.

"మీరు అధిక ప్రసంగం చేస్తున్నారు" వుడుకుమోత్తనంగా అన్నాడు, రాఘవులు.

నాలో, సహనం పట్టుతప్పింది. "వాడ్డూయూ మీన్? మీ హద్దులు తెలుసుకుని మాట్లాడండి. మీరు వీళ్ళిద్దరికీ మాటిచ్చినంత మాత్రాన, కేబిన్‌లో

మరెవ్వరూ వుండకూడదంటే యెట్లా! తోటి రైల్వే వుద్యోగివన్న అభిమానం మేకోశానా లేకపోవడమేగాకుండా, కేవలం డబ్బుకోసమే కక్కుర్తిపడి, మీ యిష్టం వచ్చినట్టు ప్రవర్తించడం, మాట్లాడ్డం సబబుగా లేదు'' కటువుగానే అన్నాను.

బహుశా, రాఘవులు నాలాంటి వాణ్ణి యెన్నడూ ఫేస్ చెయ్యలేదేమో.

''మిష్టర్! ఏమిటి మీరంటున్నది?'' అన్నాడు కాస్తంత కోపంగా.

''నేననడంకాదు. వీళ్ళిద్దరి సంభాషణతోనే విషయమేమిటో అవగత మయ్యింది నాకు. అందుకే రైల్వే వుద్యోగుల్లో కొందరంటే, ప్రతివాడికీ మేహ్యాభావం వుంటోంది.''

రాఘవులు అర్థం చేసుకున్నట్టుంది. తాను రాకముందు యేం జరిగి వుంటుందో. కిక్కురుమనకుండా నాకేసి అదోలా చూసి, బైటికి నడుస్తూ వాళ్ళిద్దరితో అన్నాడు.

''రాజమండ్రిలో వీళ్ళు దిగిపోతారండీ. డోన్ట్‌మైండ్. అక్కడ వేస్తాన్లెండి.''

నాలో నేను నవ్వుకున్నాను. విజయోత్సాహంతో.

మెయిలు మందకొడిగా బయల్దేరి, వేగాన్ని అందుకుంది.

''మీ రైల్వే వాళ్ళ వుద్యోగాలే బావున్నాయండీ. హాయిగా పాసులుంటాయి. ఎక్కడికయినా ఫ్రీగా వెళ్ళొచ్చు'' ఆ యిరువుర్లో ఒకాయన అన్నాడు.

రైల్వే వాళ్ళంటే, చాలామందికి యిదోరకమైన అసూయవుంది. అంతేగాని, దూరంగా యెవరూ ఆలోచించరు.

''అదొక్కటే మాకు మిగిలిందండీ! అయినా, యిప్పుడు ప్రతివాళ్ళకీ ఎల్‌టీసీలు యిస్తున్నారు కదా. ప్రయాణం చేసి టిక్కెట్లు సబ్మిట్ చేస్తే, డబ్బులొచ్చేస్తున్నాయి. ఇక, మా ప్రత్యేకత యేముందని? ఇకపోతే, మిగిలిన వారిలా మాకు జీతాలెక్కడివి? నిజం చెప్పాలంటే, అందరికంటె తక్కువ జీతాలు, మా రైల్వే వారివే. పాసులుండటం, 'గుడ్డిలో మెల్ల' అంతే. బ్యాంకుల్లోనూ, ప్రైవేటు కంపెనీల్లోనూ వుండే యితరత్రా సదుపాయాలూ మాకు లేవు.'' అన్నాను.

ఆ యిరువురిలో యే ఒక్కరూ మళ్ళీ ప్రశ్నవెయ్యలేదు. వాళ్ళు బహుశా యే బ్యాంకు వుద్యోగులో, లేక ప్రైవేటు కంపెనీ వుద్యోగులో అయ్యుంటారు.

రాజమండ్రిలో బండాగింది. మేం దిగిపోయాం.

రాఘవులు నావేపు కొరకొర చూశాడు. నేను మాత్రం నవ్వుకున్నాను. నేను ఖాళీ చేసిన కేబిన్‌లోకి వెళ్ళాడు, రాఘవులు.



* * *

నాలుగు నెలలు గడిచాయి.

నేను విజయవాడ వెళ్ళడం తటస్థించింది.

నా స్నేహితుడు రాజు, అసిస్టెంటు కమర్షియల్ సూపరింటెండెంట్‌గా వుంటున్నాడు విజయవాడలో. వాణ్ణి చూడ్డానికి ఆఫీసుకి వెళ్ళాను.

నన్ను చూడగానే రాజు, యెంతగానో మురిసిపోయాడు.

''రారా మూర్తీ ఎప్పుడొచ్చావు?'' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు రాజు.

''రెండ్రోజులయ్యిందిలే. నువ్విక్కడున్నావని తెలిసింది. చూసి పోదామని వచ్చాను'' కూచుంటూ అన్నాను.

''మంచి పని చేశావు. చాలా రోజుల తర్వాత కలుసుకున్నాం. మీరంతా కులాసాయే కదా?''

''ఆ! బాగానే వున్నాంరా!''

''కాఫీ తీసుకుంటావా? లేక టీయా?''

''కాఫీ తెప్పించు.''

ప్యూన్‌ని కేకవేసి కాఫీ తెప్పించాడు రాజు. ఇద్దరం కాఫీ తీసుకుంటూ, యేవో కబుర్లు చెప్పుకున్నాం కాసేపు. ఇంతలో ఓ గుమస్తా వచ్చాడు.

''సార్! రాఘవుల్ని బుకాఫ్ చెయ్యమన్నారుకదా, అతనొచ్చాడండీ'' అన్నాడతను.

''రమ్మనండి...''

నాకు ఆనాటి రాఘవులు గుర్తుకొచ్చాడు నా కళ్ళముందు. చింతపండు ముద్దలాంటి ఆ మొహం, లీలగా మెదిలింది.

''ఈ రాఘవులు, యేం పన్జేస్తుంటాడ్రా రాజా...?'' అడిగాను.

''ఫస్టుక్లాసు కండక్టర్లే ఏం?''

''అయితే, నా వూహ కరెక్ట్!''

''ఏవిట్రా నువ్వూహించింది?''

''నాలుగు నెలల క్రితం నేను ప్రయాణం చేస్తున్నపుడు, ఓ రాఘవులు తారసపడ్డాడు. అతనూ ఫస్టుక్లాసు కండక్టరే! అతనే యితడయ్యుంటాడను కున్నాను.''

''అతడే మరి!''

''రఫ్ బిహేవియర్రా రాజా యితనిది. మా యిద్దరికీ చాలాసేపు వాగ్వివాదం జరిగింది. రైల్వేవాళ్ళమన్న అభిమానమే లేదు. కేవలం డబ్బే ప్రధానం. రైలుబండి తన యాజమాన్యంలోనే వున్నట్టు ప్రవర్తించాడు.'' సమయం చిక్కిందికదా అని చెప్పాను.

''ఐసీ. నీతోనూ అట్లాగే ప్రవర్తించాడన్నమాట! ఓ మిలిట్రీ ఆఫీసరు రిపోర్టు చేస్తే రాఘవుల్ని పిలిపించాను.''

అప్పుడే ఆ గుమస్తా రాఘవుల్ని తీసుకుని లోపలికొచ్చాడు.

''నమస్కారం సార్!'' లోపలికొస్తూనే రాజుకి అభివందనం చేశాడు రాఘవులు.

నన్ను చూశాడు. అతనికి చెమటలు పట్టినట్టయ్యింది. మొహంలో మార్పు వచ్చింది. పెదాలు తడుపుకుంటున్నాడు. బహుశా, నేనే రిపోర్టు చేసి వుంటానని

అనుకుంటూ వుండొచ్చు.

"రాఘవులూ, నీకు వుద్యోగం చెయ్యాలని లేదా?" ప్రశ్నించాడు, రాజా.

"అదేం సార్?" తడబడ్డాడు రాఘవులు

"మొన్న పదో తేదీన హౌరా మెయిల్లో, మిల్ట్రీ ఆఫీసరుతో యెందుకలా బిహేవ్ చేశావు?"

"అదంతా అబద్ధం సార్."

"స్టుపిడ్! ఆయన రిపోర్టు యిచ్చింది అబద్ధమూను, నువ్వు చెప్పిందే నిజమని నమ్మమంటావా? నువ్వో సత్యహరిశ్చంద్రుడివేనని నమ్మేయమంటావ్. ఏం? పోనీ, ఆ మిల్ట్రీ ఆఫీసరు నిలవలేకనిలవలేక కల్పించి చెప్పాడే అనుకుందాం. సరే! మరి, నాయెదుట కూచున్న నా మిత్రుడు చెప్పిందీ అబద్ధమేనంటావా?" తీక్ష్ణంగా చూస్తూ ప్రశ్నించాడు రాజా.

నేను యెదురుగా వుండడం వల్ల, రాఘవులు కట్టుకథ చెప్పలేకపోయాడు. మొహం దించేసుకున్నాడు.

"ఏంరా రాజా! పగటిపూట రిజర్వేషను లేకుండా ఫస్టుక్లాసులో ప్రయాణించ డానికి యేమన్నా అభ్యంతరాలున్నాయా? నాకు తెలిసినంతవరకూ లేవనే..." అడిగాను.

"అభ్యంతరం యేమీ లేదే! ఎవరు అన్నారలా అని?"

"ఇదిగో, యీయనే. పైగా, జి.ఆర్.పీని రప్పించి నన్నూ, నా ఫామిలీని దింపేస్తానన్నాడు కూడాను. అయితే, కాస్తంత రూల్సు తెలిసిన వాణ్ణే గాబట్టి, మొండికేసి కూచున్నాను. భయపెట్టడానికి అలా అన్నాడేగాని, ఆచరణలో పెట్టే దమ్ము లేకపోయింది."


రాజా మొహం యెర్రబారింది. రాఘవులు కేసి యెర్రగా చూశాడు.


"ఏం రాఘవులూ, అంత డిక్టేటర్‌షిప్ చెలాయిస్తున్నావా ట్రెయిన్లో? ప్రయాణీకులతో సామరస్యం సంపాదించుకోలేనివాడివి, నువ్వు కండక్టర్ వుద్యోగానికి అనర్హుడివి" కోపంగానే అన్నాడు, రాజా.

"క్షమించండిసార్. తప్పయ్యింది." మరో మార్గంలేక సరండరైపోయాడు, రాఘవులు. దొంగిలించబడ్డ వస్తువులతోపాటు పట్టుబడ్డ దొంగలా,మొహం దించు కున్నాడు.

రాజా, గుమాస్తా నేపు తిరిగాడు. "శ్రీనివాసరావుగారూ, ఆ కేసు యిలా యివ్వండి. ఈ రెండు సంఘటనల్లోనూ రాఘవులు దోషిలానే అగుపిస్తున్నాడు. రిపోర్ట్ చేసేస్తాను...అక్కడితో తలబిరుసు అణిగిపోతుంది..."అంటూ చేయి చాపాడు రాజా.

శ్రీనివాసరావు కేసుని అందించాడు"రివర్షన్ యెందుకు లేరా! వార్నింగిచ్చి వదిలేయ్ ప్రస్తుతానికి. మారడానికి అతనికో అవకాశం యివ్వు. జ్ఞానమున్న వాడైతే మారిపోతాడు" అన్నాన్నేను చప్పున కలిగించుకుని.



చిత్రం. శర్మ సాశ.

రాజా, నా సహృదయతని గమనించిగామోసు, చిరునవ్వు నవ్వేడు. రాఘవులు కేసి చూశాడు.

"వింటున్నావా రాఘవులూ, మావాడేమంటున్నాడో? మంచి ప్రవర్తన అలవర్చుకోవయ్యా! అధికారం చేతిలో వుందికదా అని, హద్దుల్ని అతిక్రమించి ప్రవర్తించకూడదు. నీలాంటివారి వల్లే మన సంస్థకి చెడ్డపేరొస్తోంది. మావాడు అపకారం చెయ్యదల్చుకుంటే, వాడికి మంచి అవకాశం లభించింది. కాని, వాడి మనసు వెన్నపూస. ఇదేనోయ్, మంచికీ, చెడుకీ వ్యత్యాసం. వీడి మంచితనమే నిన్నీరోజు రక్షించిందనుకో. ఈ సంఘటన నువ్వు గుర్తుంచుకుంటే, తప్పకుండా మారతావు" అంటూ తన చేతిలో వున్న ఫైలుమీద 'ది స్టాఫ్ యీజ్ వార్న్డ్ సివియర్లీ' అని రాసేసి, కేసుని శ్రీనివాసరావుకి అందించాడు.

"థాంక్స్ సార్!" అన్నాడు రాఘవులు కృతజ్ఞతాభావంతో.

"థాంక్స్ చెప్పాల్సింది నాకు కాదు... మావాడికి..." అన్నాడు రాజా.

రాఘవులు నా దగ్గరికొచ్చాడు.

"సార్! మీ మంచితనం నా జీవితగమనాన్నే మారుస్తుంది. సర్వదా మిమ్మల్ని గుర్తుంచుకుంటాను" అన్న రాఘవులు కళ్ళల్లో అశ్రువులు గిర్రున తిరిగాయి.

రాఘవులు మా యిద్దరికీ మరోసారి నమస్కారంచేసి నిష్క్రమించాడు.

శ్రీనివాసరావు, చిన్నగా నవ్వుకుంటూ రాఘవులు వెంట వెళ్ళిపోయాడు.

"ఒరేయ్ రాజా, చూశావా అతనిలో యెట్లా మార్పు వచ్చిందో?" అన్నాను తృప్తిగా.

రాజా నవ్వేడు మెల్లగా.

"ఆ మార్పు ఆచరణలోకి రానీయ్‌రా! అప్పుడు అనుకుందాం మారాడని!"

"మరి, నేను వెళ్ళొస్తారా..." లేచాను.

"సాయంత్రం యింటికి రావాలి సుమా! ఇదిగో నా అడ్రసు" అంటూ అడ్రసు రాసి యిచ్చాడు.

"తప్పకుండా వస్తారా..." బైటకి నిష్క్రమించాను.

ఒక విధంగా, రాఘవులుపై విజయం సాధించాననే తృప్తి నాలో నిండింది.

*